క్లుప్తంగా

ఎమ్మెల్యే గణేష్‌కు ఘన సత్కారం



ఎమ్మెల్యే గణేష్‌ను సత్కరిస్తున్న డీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ అనిత, సన్యాసిపాత్రుడు

నర్సీపట్నం: డీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత, సన్యాసిపాత్రుడులతో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ శుక్రవారం ఆత్మీయ సమావేశమయ్యారు. తమ ఇంటికి విచ్చేసిన ఎమ్మెల్యే గణేష్‌కు వారు సాదర స్వాగతం పలికారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. అనంతరం ఎన్నికల ప్రచారంపై చర్చించారు. మున్సిపాలిటీలో ప్రచార బాధ్యతలు తీసుకోవాలని సన్యాసిపాత్రుడును ఎమ్మెల్యే కోరారు. సలహాలు, సూచనలు అందించి ప్రచారాన్ని ముమ్మరం చేసి పార్టీకి విజయానికి కృషి చేయాలన్నారు.

8న జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పోటీలు

దేవరాపల్లి: ఎం.అలమండలో ఈ నెల 8న నూకాంబిక మహోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలను నిర్వహించనున్నట్లు సర్పంచ్ దాడి జగన్, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక యూత్ ఆర్థిక సాయంతో నిర్వహించే ఈ పోటీల్లో మొదటి బహుమతి పావు తులం బంగారం, తర్వాత స్థానాల్లో వరుసగా రూ.16 వేలు, రూ.13 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1,500, రూ.వెయ్యి చొప్పున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

సారాతో ఒకరి అరెస్టు

చోడవరం రూరల్: సారాతోపాటు ఒకరిని పట్టుకున్నట్టు సీఐ బి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. సమాచారం మేరకు ఎస్‌ఐ డి.శేఖరం తన సిబ్బందితో కలిసి పట్టణంలోని కోటవీధిలో నౌడు వెంకటరావు(38) ఇంట్లో సోదాలు నిర్వహించగా, ఇరవై ఒకటిన్నర లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అతడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు.

అక్రమంగా బియ్యం తరలింపు

- డీలర్‌ను సస్పెన్షన్

గొలుగొండ: లింగంపేట రేషన్ డిపో నుంచి అక్రమంగా 750 కిలోల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా గురువారం రాత్రి గ్రామస్తులు అడ్డుకుని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. 6ఏ కేసు నమోదు చేసి, డీలర్‌ను సస్పెండ్ చేసినట్టు తహసీల్దార్ ప్రభాకర్‌రాజు తెలిపారు.

వేడుకగా అడవిరాజులబాబు విగ్రహ ప్రతిష్ట



అడివిరాజులబాబుకు పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట: లగుడు కొత్తూరులో నూతన ఆలయంలో అడవిరాజులబాబు విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులతోపాటు కొమరవోలు గ్రామం నుంచి భక్తులు వచ్చి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

కె.జె.పురంలో నూకాంబిక అంబలం పూజ



పూజలో భక్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో నూకాంబిక అంబలం పూజా కార్యక్రమం గురువారం రాత్రి ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కె.జె.పురం, కె.పి. అగ్రహారం గ్రామాలకు చెందిన అమ్మవారి మాలధారణ భక్తులు పాల్గొన్ని భక్తి గీతాలు ఆలపించారు. అరటిబొదెలతో అమ్మవారి అంబలంను స్థానిక కళావేదిక వద్ద ఏర్పాటు చేశారు.

'రామానాయుడుకు టికెట్ ఇవ్వకుంటే రాజీనామాలు'

చీడికాడ: మాడుగుల అసెంబ్లీ టికెట్ మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుకు కేటాయించకుంటే పార్టీ పదవులకు మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బాది తాతారావు, సర్పంచ్ కొల్లి సూరినాయుడు, ఎంపీటీసీలు పైల ముత్యాలనాయుడు, గాడి ప్రసాద్, కోటి హెచ్చరించారు. పలు గ్రామాల కార్యకర్తలతో కలిసి చీడికాడలో ర్యాలీ నిర్వహించారు.

వలంటీర్లపై కక్ష... పింఛన్‌దారులకు శిక్ష



దేవరాపల్లి సచివాలయంలో పింఛన్ల అందుకుంటున్న అవ్వాతాతలు

- ఎన్నికల కమిషన్‌కు పచ్చబ్యాచ్ ఫిర్యాదు
- ఇంటింటికీ ఆగిన పింఛన్ల పంపిణీ
- మండుటెండలో అవ్వాతాతల అవస్థలు

దేవరాపల్లి: పింఛన్‌దారులకు కష్టాలు వెంటాడుతున్నాయి. వలంటీర్ల సేవలపై పచ్చబ్యాచ్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో లబ్ధిదారుల ఇంటి వద్దకు పింఛన్ల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సెలవు దినం అయినప్పటికీ సచివాలయ అధికారులు పింఛన్ల పంపిణీ చేపట్టారు. దాంతో వృద్ధులు వ్యయ ప్రయాసల కోర్చి సచివాలయానికి వచ్చి పింఛన్ సొమ్ము అందుకుంటున్నారు. గతంలో గడప దాటకుండా ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారక ముందే వలంటీర్లు పింఛన్ అందజేసేవారని, ఇప్పుడు ఇలా ఎందుకు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నా రని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశా రు. ఇలా ఎండలో రప్పించడం న్యాయం కాదని వాపోయారు.

రావికమతం: చంద్రబాబు రాజకీ య కుట్రకు వలంటీర్లను విధుల నుంచి దూరం పెట్టగా, వృద్ధుల కు పింఛన్ కష్టాలు వెంటాడుతున్నాయి. కిలోమీటర్ల మేర మండటెండలో ఆయాసపడుతూ సచివాలయాలకు వచ్చి క్యూలో నిలబడి ఆపసోపాలు పడుతున్నారు. టి.అర్జాపురం సచివాలయం పాత కొట్నాబిల్లికి చెందిన పింఛన్‌దారులు నానా ఇబ్బందులు పడుతూ సచివాలయానికి వచ్చి పింఛన్ తీసుకోవాల్సి వస్తోంది. కొత్తకోట, పోతలూరు గ్రామాలకు చెందిన కన్నా ముసిలితల్లి, పైల నాగరాజు అనే వృద్ధులు ఎండకు తాళలేక మార్గమధ్యలో పలుమార్లు నీడపట్టున కూర్చుని సచివాలయాలకు అతికష్టంపై వచ్చి పింఛన్ తీసుకున్నారు. ఇప్పటి వరకూ ఇంటికే చక్కగా వలంటీర్లు వచ్చి చిరునవ్వుతో అందించే వారని, ఇప్పుడు తిప్పలకు కారకులైన టీడీపీ నేతలకు చీవాట్లు పెడుతున్నారు.

మాడుగుల రూరల్: శుక్రవారం సెలవు రోజు అయినప్పటికీ సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేపట్టారు. దీర్ఘకాలిక రోగులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి వెల్ఫేర్ అసిస్టెంట్లు పింఛను నగదు అందజేశారు. సాయంత్రానికి మండలంలో 11,998 మంది పింఛనుదారులకుగాను 11,281 మందికి పంపిణీ చేసి 94.02 శాతం మేర పూర్తి చేశామని ఎంపీడీవో ఆర్.కాశీప్రసాదరావు తెలిపారు. శనివారం పింఛన్ల పంపిణీ చివరి రోజు అన్నారు. మండలంలో అభయహస్తం పింఛన్ల కింద 178 మందికి రూ.89 వేలు విడుదల అయిందని, వీటిని లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు.



కె.జె.పురంలో దివ్యాంగురాలికి పింఛను అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ సాగర్

మండుటెండలో నరకయాతన



గత నెల వరకు వలంటీర్లు గడప దాటి కాలు బయట పెట్టకుండా పింఛన్ సొమ్ము చేతిలో పెట్టేవారు. చేతికర్ర ఉంటే తప్పా ఇంట్లో సైతం అడుగు వేయలేని పరిస్థితి నాది. సచివాలయంలో పింఛన్ పంపిణీ చేయడంతో నా కుమారుడి సహాయంతో అతి కష్టం మీద వచ్చాను. మండుటెండలో రావడంతో నరకయాతన అనుభవించాను. మాలాంటి ముసలోళ్లను ఇలా ఇబ్బందులకు గురిచేయడం మంచిది కాదు. మరుసటి నెల నుంచైనా వలంటీర్ల ద్వారా ఇంటి దగ్గరే అందించేటట్లు చేయండి.
– గుల్లిపల్లి సన్యాసమ్మ, వృద్ధురాలు, మొండి వీధి, దేవరాపల్లి

3 కిలోమీటర్లు నడవాల్సి వచ్చింది

నాకు జబ్బు చేసింది. కీళ్ల నొప్పులు, అడుగు తీసి అడుగు వేయాలంటే చాలా సమయం పడుతుంది. అలాంటిది ఎండతో మూడు కిలోమీటర్లు దూరం రావాల్సి వచ్చింది. ఎండకు సొమ్మసిల్లి పడిపోయేలా కాలం ఉంది. గతంలో మాదిరి ఇంటికే పంపిస్తే బాగుంటుంది. లేకపోతే ప్రాణాలు దారిలోనే పోయేలా ఉన్నాయి. – తుర్రె నాగరాజు,
పాత కొట్నాబిల్లి, రావికమతం

ఇబ్బందులు పెట్టకండిబాబు



నాలాటోళ్లని ఇబ్బందులు పెట్టకండిబాబు. తిరగలేకపోతున్నాను. ఎండకు కళ్లు బయర్లు కమ్ముతున్నాయి. పోతలూరు నుంచి తోట కూరపాలెం నడవాలంటే పై ప్రాణం పైనే పోయేలా ఉంది. వచ్చే నెల నుంచైనా ఇంటికి పంపించండి బాబూ – కన్నా ముసిలితల్లి, పోతలూరు, రావికమతం మండలం

చాలా ఇబ్బంది పడ్డాను



ఆటో నడుపుకుంటూ ఇందిరమ్మ మోడల్ కాలనీలో జీవించేవాళ్లం. మా నాన్న చనిపోయారు. మాకు సెంటు భూమి లేదు. కిడ్నీ సమస్యతో నేడు డయాలసిస్ చేయించుకుంటున్నా. ప్రభుత్వం పింఛను ఇవ్వడంతో ఆసరాగా మారింది. ప్రతి నెలా ఇంటికి వలంటీరు వచ్చి పింఛన్ సొమ్ము ఇచ్చేవారు. ఇప్పుడు సచివాలయానికి వెళ్తే ఆవేశం వచ్చేసింది. – నీలం శివశంకర్, నాతవరం

ఆటోపై వచ్చాను



మనిషి సాయం లేనిదే నడవలేని పరిస్థితి నాది. ఎస్సీ కాలనీ నుంచి సచివాలయానికి ఆటోపై వచ్చి పింఛను తీసుకున్నాను. ఆటోపై రావడంతో అదనంగా ఆర్థిక భారం పడింది. ఈ వయసులో బాధపెట్టడం సరి కాదు. మూర్తి దేవత, నాతవరం గ్రామం

శరభవరం వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



ఎంపీడీవో జాన్ లింకన్‌కి రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

రోలుగుంట: మండలంలో శరభవరం, అర్ల పంచాయతీల నుంచి 19 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవో కె.జాన్ లింకన్‌కు రాజీనామా పత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్య పాలనకు శ్రీకారం చుట్టి వలంటీరు వ్యవస్థ ప్రవేశ పెట్టారన్నారు. తాము ప్రజలకు అందిస్తున్న సేవలతో మాజీ సీఎం చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ జీర్ణించుకోలేక అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. తమను విధుల నుంచి తప్పించేందుకు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం వల్లే తామే స్వచ్ఛందంగా రాజీనామా చేశామన్నారు. ఇప్పుడు తాము బంధ విముక్తులమయ్యామని, ఇప్పటి నుంచి పేదలకు అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల గురించి వివరించి ప్రచారం చేస్తామన్నారు. మరలా కరణం ధర్మశ్రీని ఎమ్మెల్యేగాను, బూడి ముత్యాలనాయుడిని అనకాపల్లి ఎంపీగాను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. రెండోసారి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేస్తామని ముక్తకంఠంతో అన్నారు.

మేము ప్రజా సేవకులం



ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు చేరాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థ ప్రవేశపెట్టారు. అతని ఆశయాన్ని వమ్ము చేయకుండా కరోనా కాలంలోనూ మా సేవలు విస్తృతపరచాం. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీకి వస్తున్న ప్రజాదరణ చూడలేక కక్షిసాధింపుతో ఎన్నికల కమిషన్‌కు చంద్రబాబు ఫిర్యాదు చేయించారు. మీరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్ని మమ్మిల్ని దూరం పెట్టించినా తాజా ఎన్నికల్లో మరలా సీఎంగా జగన్ గెలవడం ఖాయం. మా సేవలను వినియోగించుకుంటామని ప్రకటించడం చాలా ఆనందంగా ఉంది.
– దోసపత్ని సాయి, వలంటీర్, శరభవరం గ్రామం, రోలుగుంట మండలం

సీఎం ప్రకటన సంచలనం



ప్రతి ఇంటికీ పథకాలు అందాలనే లక్ష్యంతో మరలా వలంటీర్ వ్యవస్థను పునరుద్ధరిస్తామని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం ఒక సంచలనం. ప్రతిపక్షాలు వలంటీర్ వ్యవస్థపై లేనిపోని అసత్య ప్రచారాలు చేయడమేగాక, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం దారుణం. అందుకే స్వచ్ఛందంగా రాజీనామా చేశాం. అధికారంలోకి రాగానే వలంటీర్ వ్యవస్థ పునరుద్ధరణకు తొలి సంతకం చేస్తామని సీఎం ప్రకటించడం ఎంతో సంతోషకరం.
– బి.ప్రసాద్, మాజీ వలంటీర్, కొండలఅగ్రహారం

ఘనంగా నూకాలమ్మ విగ్రహ ప్రతిష్ట



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ అభ్యర్థి బూడి

చీడికాడ: నూకాలమ్మ నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం చీడికాడలో ఘనంగా నిర్వహించారు. డోకల వారి ఇలవేల్పులుగా పూజలందుకుంటున్న అమ్మవారి ఆలయం శిథిలం కావడంతో దాని స్థానంలో నూతన ఆలయాన్ని నిర్మించారు. ఆలయ మండపం నిర్మాణానికి ఎంపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ.5 లక్షలు కేటాయించారని ఆలయ కమిటీ సభ్యుడు డోకల దాసు తెలిపారు. గ్రామస్తులు, దాతల సహకారంతో నిర్మాణం పూర్తి చేశామన్నారు. ముత్యాలనాయుడు, మాడుగుల అసెంబ్లీ అభ్యర్థి ఈర్లె అనూరాధలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు నిర్వహించారు. ఎంపీపీ కురచా జయమ్మ నారాయణమూర్తి, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు పాల్గొన్నారు.



ములకలాపల్లిలో ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు వేదపండితుల ఆశీర్వచనం

ఘనంగా చెల్లయ్యమ్మ పేరంటాలు విగ్రహ ప్రతిష్ట

దేవరాపల్లి: ములకలాపల్లిలో చెల్లయ్యమ్మ పేరంటాలు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు పాల్గొని పేరంటాలను దర్శించుకుని పూజలు చేశారు. ఆయనకు తొలుత గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. గ్రామస్తులు సైతం పేరంటాలకు ప్రత్యేక పూజలు చేశారు.

జిల్లాలో అశాంతి రేపుతున్న టీడీపీ, బీజేపీ

- ఆ పార్టీల అభ్యర్థులకు బుద్ధి చెప్పండి
- సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్‌సీపీని గెలిపించండి
- చోడవరం ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



గాంధీ గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: ప్రశాంతమైన అనకాపల్లి జిల్లాలో దౌర్జన్య రాజకీయాలు చేసేందుకు కడప నుంచి ఇక్కడకు వచ్చిన కూటమి అభ్యర్థి సీఎం రమేష్‌ను రానున్న ఎన్నికల్లో ఓడించి ప్రజలంతా బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. గాంధీ గ్రామం, చోడవరం పట్టణంలో రామ్మోహనరావుపేట, చినబజార్, పెదబజార్, అంబేడ్కర్ కాలనీల్లో శుక్రవారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా ధర్మశ్రీకి మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి ప్రజలకు ఎటువంటి ప్రయోజనం చేయని, నాలుగేళ్లుగా నియోజకవర్గం ప్రజలను పట్టించుకోని టీడీపీ అభ్యర్థి రాజు ఏమి చేస్తానని ఇప్పుడు ప్రజల్లోకి వస్తున్నారని ప్రశ్నించారు. అధికారంలోకి రాకముందే వీరిద్దరి దౌర్జన్యాలు పెరిగిపోయాయని, ప్రజలంతా అప్రమతంగా ఉండాలని కోరారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిందన్నారు. పార్టీలకతీతంగా పింఛన్లు, డ్వాక్రా మహిళలకు ఆసరా, చేయూత పథకాలతోపాటు ఇంటి స్థలాలు, పక్కా గృహాలు ఇచ్చామన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యేగా తాను పోటీ చేస్తున్నామని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ధర్మశ్రీ కోరారు. జెడ్పీటీసీ మారిశెట్టి విజయశ్రీకాంత్, ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్ గాడి అప్పారావు, ఉప సర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, జిల్లా ఉపాధ్యక్షురాలు బొగ్గు శ్యామల, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవరపల్లి సత్య, పందిరి శ్రీనివాసరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, మహిళా అధ్యక్షురాలు యర్రాదేవి, వార్డు మెంబర్లు గూనూరు రాజు, పసుమర్తి సంతోష్, నాయకులు సతీష్, పసుమర్తి గుప్తా,ఉప్పలబాబు పాల్గొన్నారు.

గురందొరపాలెంను జల్లెడ పట్టిన పోలీసులు

- ఇళ్లల్లో సోదాలు
- పాతనేరస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చిన డీఎస్పీ మోహన్



డాగ్ స్క్వాడ్‌తో గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

నర్సీపట్నం: మండలంలోని గురందొరపాలెంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. శుక్రవారం ఉదయం వందలాదిగా పోలీసులు గ్రామంలోకి ప్రవేశించడంతో ఏం జరిగిందోనని గ్రామస్తుల్లో ఆందోళన నెలకొంది. ఈ సందర్భంగా దాదాపు రెండు గంటల పాటు తనిఖీలు నిర్వహించారు. బయట వ్యక్తులను గ్రామంలోకి అనుమతించలేదు. అదేవిధంగా గ్రామస్తులను బయటకు వెళ్లనీయలేదు. ఈ గ్రామంలో గంజాయి, సారా కేసుల్లో ఉన్న వారి ఇళ్లను క్షుణ్ణంగా సోదాలు చేశారు. రికార్డులు పరిశీలించి, లేని వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. సారా తయారీకి వినియోగించే పాత్రలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మోహన్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు వీలుగా కార్డన్ సెర్చ్ కార్యక్రమం చేపట్టామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న సమాచారంతో గ్రామాన్ని జల్లెడ పట్టినట్టు చెప్పారు. ఈ తనిఖీల్లో మొత్తం 120 మంది సివిల్, రైల్వే పోలీసులు పాల్గొన్నారని, డాగ్‌స్క్వాడ్‌ను వినియోగించామని డీఎస్పీ తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



పూజలు చేస్తున్న అభ్యర్థి అనురాధ

మాడుగుల రూరల్: ఆధ్యాత్మిక చింతనతో గ్రామాల్లో ప్రజలు మానసిక ప్రశాంతత పొందుతారని వైఎస్సార్‌సీపీ మాడుగుల నియోజకవర్గ అభ్యర్థి ఈర్లె అనురాధ అన్నారు. వంటర్లపాలెంలో నూతనంగా నిర్మించిన పరిదేశమ్మ ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శుక్రవారం ఆమె పాల్గొని పూజలు చేశారు. సర్పంచ్ అల్లాడ నాగేశ్వరావు, ఎంపీటీసీ సభ్యురాలు దండి నాగరత్నం, కోవెల చినబాబు, కోవెల శ్రీనుల ఆర్థిక సహకారంతో గుడిని నిర్మించారు. దండి నర్సింగరావు, జి. కనకారావు, సకలా మానీలు, ఉప సర్పంచ్ వెంకటరమణ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు. ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ఆదర్శనీయుడు జగ్జీవన్‌రామ్



నర్సీపట్నం : జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీవో జయరాం



గొలుగొండ: ఏఎల్‌పురంలో...



మాకవరపాలెం: కొండలఅగ్రహారంలో..



రోలుగుంటలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లక్ష్మీశ్రీనివాస్



రావికమతం: విగ్రహానికి పూలమాల అలంకరిస్తున్న గ్రామ నాయకులు



గొలుగొండ: కొంకసింగిలో..



కె.కోటపాడు ఎంపీడీవో కార్యాలయంలో..



నాతవరం: బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నేతలు



చోడవరం రూరల్: జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద



తెనుగుపూడి గురుకులంలో..

నర్సీపట్నం: బాబూ జగ్జీవన్ రామ్ 117వ జయంతిని స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆర్డీవో హెచ్.వి.జయరాం ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జగ్జీవన్ రామ్ దేశానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. తహసీల్దార్ శ్రీరాములు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ: ఏఎల్‌పురంలో నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, మాజీ జెడ్పీటీసీ వేణుగోపాల్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత బాబూ జగ్జీవన్ రామ్, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలతో నివాళులర్పించారు. కొంకసింగిలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు సిహెచ్ రాజుబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి ఈ కార్యక్రమం నిర్వహించారు. చీడిగుమ్మలలో యూత్ సభ్యులు నివాళులర్పించారు.

నాతవరం: ఎస్సీ కాలనీలో బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మాకవరపాలెం: రెవెన్యూ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి తహసీల్దార్ మురళీమోహన్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొండలఅగ్రహారం దళిత వాడలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ బిక్కవోలు ప్రసాద్, స్థానికులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. డీటీ శంకర్రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చోడవరం రూరల్: ఉన్నత పదవులను సమర్థంగా నిర్వహించడమే కాదు దళితుల ఉన్నతికి అహరహం కృషి చేసిన మహానేత బాబూ జగ్జీవన్ రామ్ అని మాదిగ ఉద్యోగ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూర్త శ్రీనివాసరావు అన్నారు. చిన్నం నాగరాజు అధ్యక్షతన స్థానిక ఇందిరా కాలనీలో బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ చిత్రపటాలను ఆవిష్కరించి ఘన నివాళులర్పించారు. మాదిగ ఉద్యోగ సంఘం సీనియర్ నాయకుడు కండెళ్ల వెంకటరావు, రాష్ట్ర రెల్లి హక్కుల పోరాట సంఘ నాయకులు యర్రంశెట్టి వరప్రసాద్, అత్తోట వజ్రభూషణం, పాట్నూరి అప్పలరాజు, యలకా రాజు, జాన్, విజయకుమార్ పాల్గొన్నారు.

రావికమతం: కొత్తకోట, జెడ్.కొత్తపట్నం గ్రామాల్లో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి వక్తలు ఘన నివాళులర్పించారు. జెడ్పీటీసీ తలారి రమణమ్మ ఆదిమూర్తి, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్మడు సత్యదేవ, కొత్తకోట సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ దేవా, శీలం శంకర్రావు, సంఘ నియోజకవర్గ, స్థానిక నాయకులు మంజేటి రాజీబాబు, ఎత్తుల రాజీబాబు, కంటిపాము శేఖర్, మంజేటి రాము పాల్గొన్నారు.

రోలుగుంట: కొమరవోలులో బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఎంపీటీసీ సభ్యుడు గొర్లె వెంకటరమణ, మాజీ సర్పంచ్ గొర్లె చెల్లంనాయుడు, రోలుగుంటలో వైఎస్సార్‌సీపీ పోతల లక్ష్మీశ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ నాయకుడు శివ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కె.కోటపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఎంపీడీవో అప్పలరాజు, ఎంఈవో – 1, 2 సత్యనారాయణ, డీవీడీప్రసాద్ పూలమాలను వేసారు. ఉపాధ్యాయులు సూర్రెడ్డి శ్రీనివాస్, సూరిబాబు పాల్గొన్నారు.

దేవరాపల్లి: తెనుగుపూడి గురుకులంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు నాగరాజు, నాగేశ్వరరావు, ధనుంజయ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఉల్లి శ్రీను నివాళులర్పించారు.